# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 03-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఉగ్రవాదం, అణ్వాయుధ బెదిరింపుల నీడలో భారతదేశం జీవించబోదని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు.
- జాతీయ భద్రతా యంత్రాంగంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) రక్షణ కవచంగా నిలుస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ పేర్కొన్నారు.
- భారత్, అమెరికా దేశాలు పరస్పరం వ్యాపారాలకు ప్రాధాన్యతనివ్వాలని కోరుకుంటున్నాయని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు.
- బ్రిక్స్ దేశాల మధ్య సైబర్ భద్రత మరింత బలోపేతం కావాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆకాంక్షించారు.
- ఐపీఎల్ 2025 ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్ వేదికగా జరుగుతోంది.

========================

ఉగ్రవాదం, అణ్వాయుధ బెదిరింపుల నీడలో భారతదేశం జీవించబోదని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. పుణే లోని సావిత్రిబాయి ఫులే విశ్వవిద్యాలయంలో 'భవిష్యత్ యుద్ధాలు, యుద్ధం' అనే అంశంపై ఈ రోజు ఆయన ప్రసంగిస్తూ.. ఈ వాఖ్యలు చేశారు. పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాదాన్ని ఆపాలని, ఇస్లామాబాద్ ప్రాతినిధ్య యుద్ధాన్ని ఇకపై సహించబోమని పేర్కొన్నారు. భారత్‌పై మరిన్ని ఉగ్రదాడులు జరగకుండా ఉండే క్రమంలో పాకిస్థాన్‌లోకి చొచ్చుకుని వెళ్లి మరీ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశామన్నారు. “ఆపరేషన్ సిందూర్”లో జరిగిన నష్టం కంటే.. ఎంత మేరకు లక్ష్యాన్ని సాధించామనేదే ముఖ్యమని ఆయన మాట్లాడుతూ…

(వాయిస్ 36 సెకన్లు)

========================

భారత్, అమెరికా దేశాలు పరస్పరం వ్యాపారాలకు ప్రాధాన్యత మార్కెట్ లభ్యత  ఇవ్వాలని కోరుకుంటున్నాయని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. పారిస్‌లో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాలు కలిసి పని చేస్తున్నాయన్నారు. వాణిజ్యం, పెట్టుబడులను పెంచడానికి ఫ్రెంచ్ నాయకులు, వ్యాపార ప్రతినిధులతో చర్చించేందుకు పారిస్‌లో  కేంద్రమంత్రి పర్యటిస్తున్నారు.

========================

న్యూఢిల్లీలోని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (DRI) ప్రధాన కార్యాలయం నూతన భవనాన్ని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ జాతీయ ఆర్థిక సరిహద్దుకు కీలక సంరక్షకుడని కొనియాడారు.  మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వ్యాపారం వంటి ముప్పుల నుండి దేశాన్ని రక్షించడంలో DRI ముఖ్యమైన పాత్రను పోషిస్తుందన్నారు. DRI భారతదేశ జాతీయ భద్రతా యంత్రాంగంలో ఒక రక్షణ కవచంగా నిలుస్తుందని సీతారామన్ పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

========================

బ్రిక్స్ దేశాల మధ్య సైబర్ భద్రత మరింత బలోపేతం కావాలని కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆకాంక్షించారు. బ్రెజిల్ రాజధాని బ్రెజిలియాలో నిర్వహించిన 11వ బ్రిక్స్ కమ్యూనికేషన్స్ మంత్రుల సమావేశంలో భారత ప్రతినిధిగా కేంద్ర మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంకుర సంస్థల  అభివృద్ధి, టెలీ కమ్యూనికేషన్స్, డేటా రక్షణ  చట్టం, డిజిటల్ నైపుణ్యాలు వంటి కార్యక్రమాలు భారత్‌ను ప్రపంచ డిజిటల్ నాయకునిగా నిలబెడుతున్నాయన్నారు. యూపీఐ ద్వారా జరిగే డిజిటల్ చెల్లింపులతో  ప్రపంచ డిజిటల్ లావాదేవీల్లో 46 శాతం వాటా భారతదేశానిదేనని గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ఒక స్థిరమైన, అంచనా వేయదగిన డిజిటల్ వ్యవస్థను నిర్మించిందని వివరించారు.

========================

జమ్మూ కాశ్మీర్‌లోని చీనాబ్ వంతెనను ఈ నెల 6వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభిస్తారని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెన అయిన చీనాబ్ వంతెన జమ్మూ కాశ్మీర్‌లో నవీనభారతదేశ బలం, దార్శనికతకు గర్వకారణంగా నిలుస్తుందని ఈ రోజు సామాజిక మాధ్యమ ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ఈ వంతెన ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్టులో ఒక భాగమని, అత్యంత కఠినమైన ప్రకృతి సవాళ్లను తట్టుకునేలా రూపొందించబడిందని  జితేంద్ర సింగ్ వెల్లడించారు.

విరామం

========================

ఈశాన్య ప్రాంతంలో భారీ వర్షాలు, వరదల కారణంగా తలెత్తిన పరిస్థితిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ, సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్‌లతో ఈ రోజు మాట్లాడారు. బాధిత రాష్ట్రాలకు సహాయం, మద్దతునిస్తామని హామీ ఇచ్చారు. అస్సాంలో ప్రస్తుత వరద పరిస్థితి గురించి విచారించడానికి ప్రధానమంత్రి తనకు ఫోన్ చేశారని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ సామాజిక మాధ్యమ ఎక్స్ వేదికగా

తెలిపారు. అస్సాం, పరిసర రాష్ట్రాల్లో నిరంతర వర్షాలు, వరదలు అనేక మంది జీవితాలను ఎలా ప్రభావితం చేశాయో, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సహాయ కార్యకలాపాల గురించి కూడా ప్రధానమంత్రికి వివరించామని ఆయన తెలిపారు.

========================

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 తుది అంకానికి చేరుకుంది. అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న ఫైనల్ మ్యాచ్ లో తొలి టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ ప్రారంభించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు జట్టు 13 ఓవర్లు పూర్తయ్యే సరికి 3 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. కాగా తొలిసారి ఐపీఎల్ టైటిల్ ను కైవసం చేసుకొనేందుకు ఇరు జట్ల మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొంది. అంతకు ముందు ఐపీఎల్ 2025 ముగింపు వేడుకల్లో భాగంగా ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత త్రివిధ దళాల ప్రతినిధులను బీసీసీఐ సత్కరించింది.

========================

మహారాష్ట్రలో 1వ తరగతి నుండి విద్యార్థులకు ప్రాథమిక సైనిక శిక్షణను ప్రవేశపెడతామని ఆ రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ మంత్రి దాదాభూసే ఈరోజు ప్రకటించారు. క్రీడా ఉపాధ్యాయులు, నేషనల్ క్యాడెట్ కోర్ (NCC), స్కౌట్స్, గైడ్స్ సభ్యులతో పాటు శిక్షణ ఇవ్వడంలో రిటైర్డ్ సైనికులు కీలక పాత్ర పోషిస్తారని మంత్రి భూసే పేర్కొన్నారు. విద్యార్థులలో దేశం పట్ల ప్రేమను పెంపొందించడానికి, వారికి జీవితాంతం ప్రయోజనం కలిగే విధంగా, క్రమం తప్పకుండా వ్యాయామాలు, క్రమశిక్షణ అలవాట్లను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

========================

వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు మే 4న దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ (యూజీ) పరీక్ష ప్రిలిమినరీ కీ ఈరోజు విడుదలైంది. ఓఎంఆర్ ఆన్సర్ షీట్‌లను అభ్యర్థుల ఈ-మెయిల్ కు పంపామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అధికారులు ఈ రోజు తెలిపారు. ప్రాథమిక కీపై అభ్యర్థులు ఈరోజు నుంచి 5వ తేదీ వరకు అభ్యంతరాలు లేవనెత్తవచ్చని, అభ్యంతరాలు తెలిపేందుకు ఒక్కో ప్రశ్నకు 200 రూపాయల చొప్పున చెల్లించాల్సి ఉంటుందని, విద్యార్థులు లేవనెత్తిన అభ్యంతరాలను సబ్జెక్టు నిపుణుల ప్యానల్ సమీక్షిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

========================

పోలీసు కానిస్టేబుళ్లు, ప్రావిన్షియల్ ఆర్మ్డ్ కానిస్టేబులరీ (PAC), మౌంటెడ్ పోలీస్ ఫైర్‌మెన్ పోస్టుల ప్రత్యక్ష నియామకాలలో మాజీ అగ్నివీర్లకు 20 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధ్యక్షతన ఈరోజు జరిగిన మంత్రివర్గ సమావేశంలో అగ్నిపథ్ పథకం కింద పని చేసిన యువతకు పోస్ట్-సర్వీస్ ఉద్యోగ అవకాశాలను కల్పించాలని నిర్ణయం తీసుకుందని ఆ రాష్ట్ర మంత్రి సురేష్ ఖన్నా తెలిపారు.

========================

భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యులు బైజయంత్ పాండా నేతృత్వంలోని అఖిలపక్ష ప్రతినిధి బృందం పలు దేశాల పర్యటనల అనంతరం ఈరోజు న్యూఢిల్లీ చేరుకుంది. ఉగ్రవాదంపై దృఢమైన వైఖరిలో భాగంగా భారత ప్రతినిధి బృందం అల్జీరియా, సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్‌లకు తన పర్యటనలను విజయవంతంగా ముగించింది. అనంతరం భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తో సమావేశమయ్యింది.

========================

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అస్సాం, మేఘాలయ, మిజోరం, మణిపూర్, నాగాలాండ్, త్రిపురతో సహా ఈశాన్య భారతదేశంలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. IMD శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ కె. జెనామణి ఆకాశవాణితో మాట్లాడుతూ... రానున్న 2 రోజుల వరకు ఈశాన్య రాష్ట్రాలలో భారీ నుండి అతి భారీ వర్షాలు కొనసాగుతాయని, ఆ తర్వాత తీవ్రత తగ్గుతుందన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు రాష్ట్ర వ్యాప్తంగా సాధారణ జనజీవనాన్ని స్థంబించిపేశాయి. రాష్ట్ర విపత్తు ల నిర్వహణ శాఖ వివరాల ప్రకారం, నిన్న సాయంత్రం వరకు ఈ వర్షాల కారణంగా 12 మంది ప్రాణాలు కోల్పోయారు.

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 81,373 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరకు 636 పాయింట్ల నష్టంతో 80,737 వద్ద ముగిసింది. నిఫ్టీ 174 పాయింట్ల నష్టంతో 24,542 వద్ద స్థిరపడింది.

==========================

==========================